క్లుప్తంగా

ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న గరుడ గ్రూపు సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కరకం బట్టు గ్రామానికి చెందిన గునకల మున్నెయ్య బుధవారం ఆనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన కుటుంబ సభ్యులకు గరుడ గ్రూపు సభ్యులు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కంచనపుత్తూరు గ్రామానికి గరుడ గ్రూపు సభ్యులు రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించటంపై మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోనే పేదరికం దూరం



విద్యాసామగ్రి అందజేస్తున్న కోటేశ్వరబాబు

శ్రీకాళహస్తి: విద్యతోనే పేదరికం దూరం అవుతుందని ప్రముఖ సంఘ సేవకులు యల్లంపాటి కోటేశ్వరబాబు అన్నారు. శ్రీకాళహస్తి మండలం మంగళపురి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తాను విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



వాల్‌పెయింటింగ్ ద్వారా అవగాహన కల్పిస్తున్న మహిళలు

ఏర్పేడు: బాల్య వివాహాలపై మండలంలోని నాగంపల్లి, నచ్చనేరి గ్రామాల్లో బుధవారం ఎస్‌ఓఎస్ బాలల గ్రామం ఆధ్వర్యంలో వాల్ పెయింట్ ద్వారా అవగాహన కల్పించారు. ఎస్‌ఓఎస్ బాలల గ్రామం మహిళా ప్రతినిధులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలను వివాహం చేసుకోవడం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలను తెలిపే ఈ వాల్ పెయింటింగ్‌లు స్థిరమైన రిమైండర్లుగా పనిచేస్తాయని చెప్పారు.

ముమ్మరంగా రోడ్డు మరమ్మతు



రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, సూళ్లూరుపేట రోడ్డు మరమ్మతులు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు 12 కిలోమీటర్లు దూరం ఉన్న బుచ్చినాయుడుకండ్రిగ- సూళ్లూరుపేట రోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా ఉంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో గుంతలను పూడ్చి తారు వేసి రోడ్డు మరమ్మతు చేస్తున్నారు.

విద్యార్థినికి సత్కారం

వరదయ్యపాళెం: గుజరాత్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి ప్రేరణ కార్యక్రమానికి హాజరైన సంతవేలూరు హైస్కూల్ విద్యార్థిని డి.ఝాన్సీని బుధవారం అభినందించి, సన్మానించారు. జాతీయస్థాయిలో జరిగిన బ్యాచ్ 16 ప్రేరణ కార్యక్రమానికి ఝాన్సీ ఎంపికై, ఆ కార్యక్రమంలో పాల్గొనింది. దీంతో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవయ్య మాట్లాడుతూ జాతీయస్థాయిలో పాఠశాలకు గుర్తింపు తెచ్చేలా విద్యార్థిని ఝాన్సీ జాతీయస్థాయి ప్రేరణ కార్యక్రమానికి ఎంపిక కావడం స్కూలుకే గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

17 నుంచి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు తాళ్లపాకలోని శ్రీసిద్ధేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయని జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఈనెల 16న ఉదయం అంకురార్పణ నిర్వహిస్తారని, 17న ఉదయం 6.28 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సాయంత్రం హంస వాహనసేవ నిర్వహిస్తారు. 18, 19, 20, 21వ తేదీల్లో ఉదయం పల్లకీ ఉత్సవం నిర్వహిస్తారు. 18న సాయంత్రం చంద్రప్రభ వాహనం, 19న సాయంత్రం చిన్నశేష వాహనం, 20న సాయంత్రం సింహవాహనం, 21న సాయంత్రం నంది వాహనసేవ జరుగుతాయి. 22న సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆర్జిత కల్యాణోత్సవం జరగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో రోజూ హరికథలు, ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అన్నమో రామచంద్రా..

ఎస్వీయూలో విద్యార్థినుల ఆందోళన



హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో బుధవారం రాత్రి పీజీ ఉమెన్స్ హాస్టల్ ప్రెమిసెస్–2లో విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. హాస్టల్ మెస్‌లో నాణ్యతలేని భోజనం విద్యార్థులకు పెడుతున్నారని, అధికారులు దీనిపై స్పందించాలని వారు నినాదాలు చేశారు. హాస్టల్ వార్డన్, అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు. ప్రతిరోజూ విద్యార్థులకు నాసిరకం భోజనం, వంటలు, కూరలు వడ్డిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనంతో పాటు హాస్టల్ పలు సమస్యలు ఉన్నాయని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డన్‌ను సాక్షి వివరణ కోరగా బుధవారం రాత్రి మెనూ ప్రకారం చికెన్ సర్వీస్ చేశామని తెలిపారు. చికెన్ కాస్త ఎక్కువగా ఉడకడంతో విద్యార్థినులు తమ దృష్టి తీసుకొచ్చారని, వంట సిబ్బందితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని సమాధానం చెప్పారు.

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వెంకటమ్మ అన్నారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని గ్రామ సచివాలయం వద్ద ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభ జరిగింది. గ్రామంలో జరిగిన 48 పనులకు ఖర్చు చేసిన రూ. 36 లక్షల సంబంధించి సామాజిక తనిఖీ వివరాలను డీఆర్పీలు వివరించారు. తనిఖీలో జరిగిన పనుల అవకతవకలను గ్రామస్తుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో రైతులు పండ్ల మొక్కలను పెట్టుకుంటే ఖర్చంతా ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఏపీఎం భాను ప్రియ మాట్లాడుతూ పండ్ల తోటల్లో నీటి గుంతలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పనుల తనిఖీ వివరాలను వివరిస్తున్న డీఆర్పీ

ఎర్రచందనం కేసులో ముగ్గురికి జైలు

శ్రీకాళహస్తి: ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ముగ్గురికి కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు రూరల్ ఇన్‌చార్జి సీఐ నరసింహరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2014లో శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లపల్లె అటవీ ప్రాంతం వద్ద తిరుపతికి చెందిన శివ, దాము, మురళి ఎర్రచందనం తరలిస్తుండగా అప్పటి ఎస్ఐ సంజీవకుమార్ అరెస్ట్ చేశారన్నారు. ఈ మేరకు కేసును శ్రీకాళహస్తి కోర్టు విచారించి నిందితులకు జైలుశిక్షతోపాటు రూ.రెండు వేలు జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

ముక్కంటి ఆలయానికి రూ.2.50 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణారావు, మధుకుమారి దంపతులు బుధవారం రూ.2,50లక్షలను విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు నగదును స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్ వైద్య సిబ్బంది

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్(ఎస్ఆర్ఎంసీ), శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్తంగా స్థానిక మెడికల్ సెంటర్ ఆవరణలో బుధవారం నిర్వహించిన చిల్ల పిల్లల(విద్యార్థులు) ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై శ్రీరామచంద్రా హాస్పిటల్స్ ప్రత్యేక వైద్య నిపుణులు శ్రీసిటీలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఎక్కువ మంది పిల్లల్లో రక్తహీనత, చర్మవ్యాధి సమస్యలు ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. శ్రీసిటీ పౌండేషన్ ప్రతనిధులు నిరీషా సన్నారెడ్డి, సురేంద్రకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ఉన్న శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఓం నమశ్శివాయ అంటూ శివ నామ స్మరణలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయంలోని నందీశ్వరస్వామివారికి, శ్రీ వాల్మికేశ్వరస్వామివారికి ఏక కాలంలో పూజలు చేశారు. ఈ ప్రదోష పూజలు, ప్రసాదాలు పంపిణీ కార్యక్రమా లకు నింద్ర గ్రామానికి శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రరెడ్డి, పాలక మండలి సభ్యులు ఆనందయ్య, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పత్రం ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నకిలీ శాలరీ సర్టిఫికెట్ ఇచ్చి మోసం చేసిన కేసులో తిరుపతి, హరిపురం కాలనీకి చెందిన మండము రాముకు ఏడాది జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి వాణిశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ క్రిమినల్ కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొన్న తిరుపతి స్కావెంజర్ కాలనీ చెందిన పి.బాలాజి అలియాస్ బిల్లా, తిరుపతి సుందరయ్య నగర్‌కు చెందిన బి.లోకేష్ స్థానిక రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్నారు. కోర్టు జామీను ఇచ్చి విడుదల కావాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2016 సెప్టెంబర్ రెండో తేదీ ఇద్దరి తరపు న్యాయవాది తిరుపతి హరిపురం కాలనీకి చెందిన మండము రాము ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నట్టు ఓ శాలరీ సర్టిఫికెట్ను సమర్పించి ఇద్దరినీ జామీనుపై విడుదల చేయాలని కోర్టును కోరాడు. న్యాయమూర్తి ఆ శాలరీ సర్టిఫికెట్ పై అనుమానం రావడంతో పోలీసులను దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

పోలీసులు దర్యాప్తు చేయగా శాలరీ సర్టిఫికెట్ ఫోర్జరీ సంతకాలతో తయారు చేసిందని దర్యాప్తులో తేలింది. దీంతో న్యాయమూర్తి ఆదేశాలతో తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అప్పటి సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్ తిరుపతి వెస్ట్ పోలీసులకు రాముపై ఫిర్యాదు చేశారు. నేరం నిందితుడు రాముపై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు

తంగేళ్లపాళెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా రవిబాబ

శ్రీకాళహస్తి: తంగేళ్లపాళెం సింగిల్‌విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ కోఆపరేటివ్ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవిబాబు బాధ్యతలు బుధవారం స్వీకరించారు. సింగిల్‌విండో త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా ఉన్న మణిబాబు నాయుడు ప్రభుత్వం మారడంతో రాజీనామా చేశారు. దీంతో పర్సన్ ఇన్‌చార్జ్‌గా రవిబాబును నియమించారు.

ఫిర్యాదులొస్తున్నాయి!



నూతన కమిటీ సన్మాన కార్యక్రమంలో డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులపై పలు ఫిర్యాదులు వస్తున్నాయి..ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి అన్నారు. తిరుపతిలోని డీపీటీఓ కార్యాలయంలో బుధవారం ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అధ్యక్షుడు గురున్నాథం నేతృత్వంలో నూతన కమిటీ పరిచయ కార్యక్రమాన్ని చేశారు. డీపీటీఓ మాట్లాడుతూ రాబడిలో తిరుపతి జిల్లా వరుసగా ఐదేళ్ల నుంచి ప్రథమస్థానంలో ఉన్న విషయాన్ని వెల్లడించారు. ప్రధానంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని పేర్కొన్నారు. వారితో కండక్టర్లు గౌరవంగా మెలగాలని అన్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో నిర్వహిస్తున్న దుకాణాల్లో లోకల్, నాన్‌లోకల్ అయినా ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాలు ముందుండాలని చెప్పారు. ఈయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ సేవాభావంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. నూతన కమిటీలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మురగమ్మ, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.మస్తాన్, జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.మల్లికార్జున్, రీజనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా జీఆర్ చంద్ర, రీజనల్ పబ్లిసిటీ కార్యదర్శిగా జే.సతీష్‌నాయుడు, రీజనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.హరిప్రసాద్‌ను డీపీటీఓకు పరిచయం చేశారు. ఆ మేరకు వారిని సన్మానించారు. డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, కంట్రోలర్ వీఆర్ కుమార్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఆక్రమణల తొలగింపు



గుడిసెలను తొలగిస్తున్న ఆర్టీసీ అధికారులు

నాగలాపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ఆ సంస్థ స్థలంలో అక్రమంగా నిర్మించిన గుడిసెలను బుధవారం సత్యవేడు డిపో అధికారులు తొలగించారు. నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సర్వే నంబర్ 996లో ఆ సంస్థకు చెందిన 56 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలాన్ని స్థానికులైన ఖాదర్ బాషా, నైనా మొహిదీన్ ఆక్రమించి గుడిసెలు వేసుకున్నారు. ఇది గమనించిన ఆర్టీసీ డిపో మేనేజర్ కేవీ రమణ పలుమార్లు గుడిసెలు తొలగించమని నోటీసులు జారీ చేసినా పట్టించుకోలేదు. డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ స్థలంలోని గుడిసెలను ఎస్ఐ ఓబయ్య, వీఆర్వో నాగభూషణం, సమక్షంలో తొలగించారు. ఆర్టీసీ స్థలంలో తిరిగి గుడిసెలు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వర్మ, హెడ్ కానిస్టేబుల్ దశరథరాజు, పవన్‌కుమార్, సివిల్ ఇంజినీర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యమ్మ తల్లి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరి సత్యమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గత మూడు రోజులుగా గ్రామంలో సత్యమ్మ తల్లి జాతర జరుగుతోంది. గ్రామస్తుల ఆహ్వానం మేరకు విచ్చేసిన ఎమ్మెల్సీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ పూజా రి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిరామయ్య, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు వడ్లతాంగళ్ బాలాజీరెడ్డి, వైస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దశరథరామిరెడ్డి, ఐతేపల్లి గురునాథం, జీపీ యాదవ్ పాల్గొన్నారు.

ఆగమోక్తంగా ప్రదోష నందిసేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రదోషనంది సేవ బుధవారం రాత్రి ఆగమోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లు ప్రదోషనందిపై ఆలయ ప్రాకారంలో ఊరేగారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో నందీశ్వరుడు

రుచికరమైన భోజనం పెట్టాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల్లో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన గోవిందప్పనాయుడుకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరంగా పెట్టాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోనే బాలికలకు భవిష్యత్



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందజేస్తున్న ఎంఈఓ దయాకర్ రావు

ఏర్పేడు: బాలికలంతా బాగా చదువుకోవాలని, అప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ–2 దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ జరిగింది. అనంతరం ఆయన మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. బాలికలు చదువుకుని దేశ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు.

బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనంద్, ప్రగతి సంస్థ మండల కన్వీనర్ శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం

శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ అన్నారు. పట్టణంలోని పూసల వీధిలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ 150వ సేవా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పేదలు, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని పేదలకు తమవంతు సాయం చేయాలన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమాలకు తనవంతు సాయంగా ప్రతి నెలా సంస్థకు రూ.10వేలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, బాబా ఫరీద్, ఉమేష్‌రావు, అస్మత్, మస్తాన్, సంస్థ సభ్యులు గరికపాటి రమేష్ బాబు, బాబా ఫరీద్, హరినాథ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న బొజ్జల బృందమ్మ